



# ప్రేమలేఖ

– పులాపు బాలకేశవులు

**కూతురి గది శుభ్రం చేస్తోంది ఆమె...“ఛీ ఛీ ఏం పిల్లలో! ఎద్దుల్లాగా ఎదిగారు గానీ బుద్ధులు మాత్రం రాలేదు. ఎంత చదివితే ఏం లాభం? గదిని పాత పుస్తకాల కొట్టులా మార్చేసింది. రోజూ చదువుకునే టేబులైనా శుభ్రంగా పెట్టుకోవడం చేతకాదు.** చూసే దిక్కులేనట్టు చిందరవందరగా పడేసిందీ పుస్తకాల్ని. అవును. మహారాణి గదా! అదు గడుక్కీ వెనుక నుంచి సర్దిపెట్టేదాన్ని నేనొకదాన్నున్నాను కదా! ఏ పుస్తకమైనా కనిపించకపోతే మరొకటి కొనుక్కొస్తుంది. ఎందుకని అడక్కుండా డబ్బిచ్చే వాళ్ళుంటే ఇలాగే ఉంటుంది. ఈ వయసులో నేనిలా వున్నానా? ఎంత పెద్దిల్లు చక్కబెట్టేదాన్ని. అయిదుగురు మరుదులు, అయిదుగురు ఆడబడుచులు. అందరూ గడుగ్గాయిలూ... చిచ్చరపిడుగులూ. పెళ్ళయి అత్తారింటికెళితే ఏం చేస్తుందీ పిల్ల?”

సర్దుతున్న పుస్తకాల్లోంచి ఒక నీలిరంగు కవరు సువాసనలు వెదజల్లుతూ కిందపడింది. విసుక్కుంటూ గొణుక్కుంటున్న ఆమె ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది. ముత్యాల్లాంటి ముచ్చటైన అక్షరాలతో కనిపించిన ఉత్తరం చూడగానే అది మామూలు ఉత్తరమై ఉండదని ఆమెకి సందేహం కలిగింది. అది నిజంగానే మామూలు ఉత్తరం కాదు. ప్రేమ లేఖ. ఊపిరి బిగబట్టి గబగబా చదివేసిందా ఉత్తరం. తరువాత ఆ ఉత్తరం రాసిన కుర్రాడిపేరు చూసింది. అప్పుడామె పెదాల మీద చిన్న నిట్టూర్పుతో చిరునవ్వు ప్రత్యక్షమైంది.

“ఓహో! అజయ్ రాశాడన్నమాట! కుర్రాడు చెడ్డవాడేం కాదు. మంచి వాడనే చెప్పాలి. రెండుసార్లు వచ్చాడు కూడా. అందమే కాదు. ఈ కాలం కుర్రాళ్ళలో లేని చక్కని వినయం కూడా ఉంది. మొదటిసారి చూసినప్పుడే తనకి నచ్చాడు.అయితే ఇంకా పసిపిల్లేనేమోననుకుంటున్న తన కూతురు రాణి ప్రేమ వ్యవహారాలు వరకూ వచ్చేసిందన్నమాట. పాపా.. చాక్లెట్ అంటూ అల్లరి చేసే రాణి. ఫ్రాక్‌లు వేసుకుని బుట్ట బొమ్మలా తిరిగే రాణి ఇంకా పాలుతాగే ప్రాయంలోనే ఉందనుకోవడం భ్రమ. ఆ పిల్ల మనసులో ప్రేమెలా పుట్టుంటుందో. తల్లి అయినా ఆమెకి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. ప్రేమంటే ఏమిటో తన చిన్నారి బుట్టబొమ్మకి తెలిసుంటుందన్న నమ్మకం ఆమెకి కలగలేదు.



***ప్రముఖ భరతనాట్యాచారుడు జి. సత్యనారాయణమూర్తి సమక్షంలో, భరత నాట్యాలయ 41వ అరంగేట్రంగా చెన్నైలోని మ్యూజిక్ అకాడమి మినీ హాలులో ఇటీవలే జరిగిన భరత నాట్యం అరంగేట్రంలో రమణీయ నృత్య భంగిమను ప్రదర్శిస్తున్న అపూర్వ, కమల, దేవిప్రియ. ఈ కార్యక్రమానికి లతారవి (నట్టువాంగం, నృత్యసమకూర్పు), విద్యా శంకర్ (గాత్రం, వ్యాఖ్యాత), సోమపురం శంకరన్ (వయోలిన్), శంకర నారాయణన్ (వేణువు), సి.కె. వాసుదేవన్ (మృదంగం)లు సహకరించిన తీరు మరిచిపోలేనిదిగా ఉంది.***

ఆమెకి గతం గుర్తొచ్చింది. సరిగ్గా ఇరవై యేళ్ళ క్రితం- అప్పటికి ఆమెకి కూడా ప్రేమంటే ఏమిటో తెలీదు. కానీ మెత్తని దొంగలా ప్రేమ తన మనసులోకి ప్రవేశించి తన శరీరం మీద గారడీ ప్రారంభించింది. పక్కింట్లోకి ఒక కొత్త ముఖం వచ్చింది. ఆ ముఖాన్ని చూడగానే తన కళ్ళు నేల చూపులు చూసేవి. సిగ్గు ముంచుకొచ్చేది. ఎంతాశ్చర్యం! ఆ ముఖాన్ని చూడకుండా ఉండలేక పోయేది తను. తీరా అతను పలకరిస్తే తను తుర్రు మనేది తూనీగలా! కానీ అతని మాటలు వినాలని తన చెవులు ఆరాటపడేవి. ఏదో తెలీని మత్తుకి గురయ్యేది తను. తన మనసు ఈ గారడీ ఏమిటో తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్న సమయంలోనే అనుకోని సంఘటన ఒకటి జరిగింది. ఆ రోజు అమ్మ ఎంత క్రూరంగా తిట్టింది? ఆ రోజు గుర్తుస్తే ఇప్పటికి కూడా ఒళ్ళు గగుర్పొడుస్తుంది?

బహుశా అది ఒక చెడు దినం కావచ్చు. చెడ్డ క్షణం కావచ్చు. అతను వెళ్ళిపోతూ తన చేతిలో ఒక ఉత్తరం ఉంచాడు. అది ప్రేమ లేఖ అయి ఉంటుందని తను ఊహించలేక పోయింది. లేకపోతే, తలుపులు బిడాయించుకునే తానా ఉత్తరం చదివుండేది. ఉత్తరం చదవడం మొదలు పెట్టగానే ఒళ్ళు ఝల్లుమంది. గుండె దడ దడలాడింది. కాళ్ళూ చేతులూ వణకడం ప్రారంభించాయి. అప్పుడనిపించింది తన నెవరైనా చూస్తున్నారేమోనని. లేచి తలుపులు వేద్దామన్నా శరీరంలో అంత బలం మిగిలినట్లు కనిపించలేదు.

అకస్మాత్తుగా విసురుగా ఒక చేయి వచ్చి తన చేతిలోని ఉత్తరాన్ని లాక్కుంది. గెండె ఆగి పోయినట్లనిపించింది. సాక్షాత్తూ యమ దూతలు వచ్చినా తను బయపడి ఉండేది కాదేమో! ఆ రోజు అమ్మ ఉగ్రరూపం చూడగానే కలిగిన భయం వర్ణనాతీతం. సున్నితమైన మనసు మీద, చిగురుటాకులాంటి సుకుమార శరీరం మీద ఎన్ని దెబ్బలు పడ్డాయో, ఎన్ని తిట్లు వర్షించాయో! ఆ రోజు నాన్నగారు లేకపోవడం మంచిదయింది. లేకపోతే తనని ముక్కలుగా నరికేసేవాడు. అమ్మ ఈ సంగతి నాన్నగారికి చెప్పలేదు. కాని మౌనంగా ఊరుకోలేదు. ఆ రోజే అమ్మ వెంట స్వగ్రామం వెళ్లాల్సొచ్చింది. అక్కడ ఇరవై నాలుగ్గంటలూ తన మీద అమ్మ సి.ఐ.డి. పని చేసేది. తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేది. వేలెడు లేవు. ఎంతకి తెగించావో అనేది.

“ఇంకా చిన్న కూచిననుకుంటున్నావా? ఏళ్ళొచ్చాయి గాని, ఏది చేయాలి, ఏది చేయకూడదో తెల్సుకునే జ్ఞానం మాత్రం రాలేదు. ప్రేమ టపా మొదలెట్టేటప్పుడు అవతలి వాడి హోదా చూసుకునే పన్లేదా? కులమేంటి? గోత్రమేంటి? అని ఆలోచించాల్సిన పన్లేదా? అందం లేదు, ఐశ్వర్యం లేదు. కనీసం చిన్న ఉద్యోగమైనా లేదు. ఉండడానికి చిన్న గూడు కూడా లేదు. అలాంటివాణ్ణి ప్రేమించడానికి ఎలా సాహసించావే? ప్రేమ నీకు తిండి పెడుతుందా? ఆ తల మాసిన సన్నాసి నీకు రెండు రోజులైనా తిండిపెట్టగలడా?” అని రోజూ సాధించేది అమ్మ.

ఒక్కోసారి మరీ కోపంతో భద్రకాళిలా రెచ్చిపోతూ...“ఏమిటే ఆలోచనలు? లైలా మళ్ళీ పుట్టిందనుకోవాలనా మేము? అసలు ప్రేమంటే ఏంటో నీకు తెలుసా?” అని మనసుని తూట్లు పొడిచేది. అమ్మ మాటలు రక్తం చిందించకుండా గుండెల్ని ఎంత గాయం చేస్తున్నా తను నోరు విప్పేదాన్ని కాదు. నోరు విప్పితే పోరు ఘోరంగా మారుతుందని తనకి తెలుసు. ప్రేమంటే తనకేమీ తెలియదు. యాదృచ్ఛికంగా ప్రేమ లేఖ తన చేతిలో పడటంతో ఇంత గొడవైంది. కానీ అమ్మ మాటలతో ప్రేమించడానికి ముందు చాలా ఆలోచించాలని అర్థమైంది. కానీ ప్రేమించేవాళ్ళందరూ నిజంగా ఇన్ని ఆలోచిస్తారా? కులమేంటి, గోత్రమేంటి? అందంతో పాటు ఆస్తిపాస్తుల సంగతేంటి? హోదా ఏంటి? ఇన్ని సంగతులు తెలుసుకుని ప్రేమించాలనేది ఎంతమందికి తెలుసు? ఇది నిజం కాదు. ప్రేమనేది నేనొస్తున్నానని ముందుగా చెప్పిరాదు. ఆగు అంటే ఆగేది కూడా కాదు. తనకు తానుగా పుట్టుకొస్తుంది. తన మార్గాన తాను దూసుకు

***(మిగతా 34వ పేజీలో చూడండి)***

## ప్రేమలేఖ

*31వ పేజీ తరువాయి*

పోతుంది. పెద్ద పెద్ద బండరాళ్ళను సైతం కోసేస్తూ దూకుడుగా దూసుకుపోయే సెల యేరులాంటిది ప్రేమ. ఇవన్నీ తన మనసులో కలిగే భావాలు కాని, నోరు విప్పి తల్లితో ఒక్క మాట కూడా చెప్పలేని పరిస్థితి. ఆ రోజులకీ, ఈ రోజులకీ ఎంత తేడా! ఈ రోజుల్లా ఆ రోజులు వున్నట్లయితే తను మౌనం వహించి ఉండేది కాదు. నిర్దాక్షిణ్యంగా అలా తన మనసు గొంతు నులిమి ఉండేది కాదు.

ఆ తరువాత ఆ పేరు తెలీని ప్రియుడి పరిస్థితి ఏమిటో, అతడేమయ్యాడో తనకి తెలీ లేదు. ఒక రోజు అమ్మతో అన్నయ్య గుసగుస లాడటం వినిపించింది. "అమ్మా! వాడంతు చూశాను. ఇక మనం నిశ్చింతగా ఉం డొచ్చు..."

ఆ రాత్రి కన్నీళ్ళతో భయంకరమైన నిశ్శబ్దం కాళ్ళు కడిగాను. మర్నాడు అమ్మ ధోరణి మారిపోయింది. చల్లబడింది. నాన్న ఓ సంబంధం నిశ్చయం చేసుకుని రావడం కూడా దానికొక కారణం. అదృష్టం చిన్న చూపు చూడలేదు. డబ్బు, హోదా, ప్రేమ, ఆత్మీయత, గౌరవమర్యాదలు అన్నీ దొరికాయి. తనకి అత్తారింట్లో అయినా ఇప్పటిక్కూడా ఆ క్షణిక మైన మొదటి ప్రణయోన్మాదం ముందు ఇవన్నీ తుచ్ఛమైనవిగా కనిపిస్తాయి. జీవితంలో ఓ మూల ఖాళీ జాగాల్లో శూన్యం నిండి కనిపిస్తోంది. ఇంకా...

* * *

ఏదో చప్పుడు కావడంతో వాస్తవంలోకి వచ్చిందామె. వెంటనే ఆ ఉత్తరం గుర్తొచ్చింది. మరోసారి ఆ ఉత్తరం చదివింది ఆమె. ఈ వేళ తన కుమార్తె ఆనాటి తన స్థానంలో కనిపించడం ఆమెకొక చిత్రంగా తోచింది. తనకి జరిగిన అనుభవం తన కుమార్తెకి జరక్కూడదని అనుకుందామె. చరిత్రని పునరావృతం చేయనని మౌనంగా ప్రతిజ్ఞ చేసింది. అజయ్ తన కులంవాడు కాదు. అంతస్తు కూడా తమకంటే తక్కువదే. అయినా ఈ విషయంలో భర్తని ఒప్పించగల శక్తి తనకుంది. ఆయనకి అమ్మాయంటే ఎంతో ప్రేమ. అమ్మాయి మనసుని నొప్పించరాయన.

ఉత్తరాన్ని యదాస్థానంలో ఉంచి మధుర స్వప్నాలు చూడసాగిందామె. ఎంతో కాలంగా తన మనసులో ఓ మూల ఖాళీగా పడున్న ఒక భాగం నెమ్మదిగా తెలీని తృప్తితో నిండు కున్నట్లనిపించిదామెకి.

సాయంత్రం- తండ్రీ కూతుళ్ళిద్దరూ ఒకేసారి వచ్చారు. ఇద్దరూ చాలా ఆనందంగా వున్నారు. కుమార్తె ఆనందానికి కారణం ఉంది. కాని ఆయన కూడా ఇంత సంతోషంగా ఎందు కున్నారు?

అడక్కుండా ఉండలేకపోయింది. ఆయన నవ్వుతూ ఒక కవర్ అందించారు. ఆ కవర్లోంచి చురుగ్గా కనిపిస్తున్న ఒక కుర్రాడి ఫోటో. ఒక ఉత్తరం బయటపడ్డాయి. ఆ ఉత్తరం ఆయన కలెక్టర్ స్నేహితుడు రాసింది. "నీ ముద్దుల రాణికి రాజును వెదకమని ఉత్తరం రాశావ్. ఒళ్ళో పిల్లవాణ్ణి పెట్టుకొని వూరంతా వెదుకుతున్నట్లుంది నీ వ్యవహారం. మా అబ్బాయి ఈ సంవత్సరమే ఐ.ఎ.ఎస్. ఆఫీసరయ్యాడు. ఫోటో పంపిస్తున్నాను. నీకు నచ్చి, యువరాణి గారికి అభ్యంతరం లేకపోతే వెంటనే జవాబు రాయి." ఆమె ఉత్తరం చదివి కనబరచిన భావాలకి ఆయన ఆశ్చర్య పోయాడు.

"ఏమిటి? నీ ముఖం ఇలా వాడిపోయిందేం? అబ్బాయి నచ్చలేదా నీకు చెప్పు?" అని అడిగారాయన.

"అబ్బే! అలాంటిదేం లేదు. రాణీని అడగండి ఆ సంగతి. ఆయన వెంటనే రాణీని పిలిచారు. పక్క గదిలో దొంగలా నక్కి ఈ మాటలన్నీ వింటూనే ఉండొచ్చు. వెంటనే వచ్చింది రాణి. ఉత్తరం గబగబా చదివి ఫోటోని శ్రద్ధగా చూసింది.

"నాట్ బ్యాడ్ పాపా...కానీ..."

"కానీ" అని కుమార్తె అనడంతో ఆమెకి ప్రాణం లేచొచ్చింది. "చెప్పమ్మా! నీమనసులో ఏముందో నిస్సంకోచంగా చెప్పు. నువ్వు ఎవర్నయినా ప్రేమించుంటే..."

సబ్జెక్ట్ మారిపోవడంతో రాణీ కాస్త అసహనంగా అటూ ఇటూ కదిలి "అమ్మా! నేనింకా ఏమీ నిర్ణయించుకోలేదు. ఇప్పుడే వస్తాను. ఒన్ మినిట్" అని పక్క గదిలోకి వెళ్ళింది. తన గదిలోంచి ఒక ఫోటో తీసుకొచ్చి తండ్రి చేతిలో పెట్టింది రాణి. "పాపా! ఈయన హరీష్! మన పట్నంలోని ప్రసిద్ధ పారిశ్రామిక వేత్త. శ్రీ మూల్‌చంద్ ఆస్తికి ఏకైక వారసుడు. అందానికేం తక్కువ లేదు. నన్ను పెళ్లాడటానికి ఈయన ఆసక్తి చూపిస్తున్నాడు. ఇప్పుడు ఈ ఇద్దరిలో అమ్మకీ, మీకూ ఎవరు యోగ్యులుగా తోస్తే అతణ్ణి నిర్ణయించండి. మీ నిర్ణయం నాకామోదమే"అంది.

కుమార్తె మాటలు వినగానే ఆమె గొంతుకలో ఏదో అడ్డుపడినట్లనిపించింది. అతి కష్టం మీద నోరు పెగల్చుకుని, "రాణీ! మరి నువ్వు ప్రేమించిన అజయ్?" అని ఆర్ధోక్తిగా ఆపింది.

"మమ్మీ! అజయ్ నీతో ఏమైనా చెప్పాడా? అతడు అమాయకుడు. పిచ్చివాడు. కాస్త కాలక్షేపం కోసం నేను లిఫ్ట్ ఇచ్చానో లేదో నా వెనుక మతి పోగొట్టుకొని తిరగడం ప్రారంభించాడు. పెళ్ళి గురించి ఆలోచించేటప్పుడు కనీసం తన హోదా ఏమిటి అనే సంగతయినా గుర్తించుకోకపోవడం మూర్ఖత్వం మమ్మీ! ఐ పిటీ హిమ్!" అంది చాలా తేలిగ్గా రాణి!

మమ్మీ పాపం ఏం జవాబు చెప్పగలదు? ఉదయం నిండటం ప్రారంభించిన ఆమె మనసులోని ఖాళీ కోణం మళ్ళీ ఖాళీ అయిపోవడం ప్రారంభించింది...అదీ చాలా వేగంగా! ❋

## వి'చిత్ర' వ్యాఖ్య పోటీ ఫలితం - 15

మేము ప్రారంభించిన వి'చిత్ర' వ్యాఖ్య పోటీలో మా ఊహకు మించి పాఠకులు పాల్గొని వ్యాఖ్యలు పంపారు. అందరికీ మా అభినందనలు. మాకు వచ్చిన (28-04-2004 సంచిక) వ్యాఖ్యలలో ఈ క్రింది వ్యాఖ్యను ఉత్తమంగా ఎన్నిక చేయడమైనది.



*"పాపాలు చేసే విలన్ పాత్రలో మమేకం*
*పాము బుసకొడితే మాత్రం భయం భయం"*

**పంపినవారు**

**జి. రామలక్ష్మి, హైద్రాబాద్**

*వీరికి ప్రియదత్త వారపత్రిక మూడు మాసాల పాటు అందజేస్తాము.* - ఎడిటర్